క్లుప్తంగా

తమిళ్ డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని నిరుద్యోగులకు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తమిళ్ డేటా ఎంట్రీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ నిర్వాహకులు రూపేష్‌బాబు తెలిపారు. ఈ పోస్టులకు మార్చి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 100 పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. నెలకు రూ.17,500 జీతం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 08572–234531ను సంప్రదించాలని పేర్కొన్నారు.

టీబీ అలర్ట్ ఇండియా ఆరోగ్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కుప్పిగానిపల్లెలో రచ్చబండ వద్ద టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో 115 మందికి టీబీ, అస్తమా, బీపీ, మధుమేహం తోపాటు ఇతర రక్త పరీక్షలు, ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ రష్మిత మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ 18 నుంచి 60 ఏళ్లపైబడిన వాళ్లు తప్పక వేసుకోవాలన్నారు. 23 మందికి శ్వాసకోశ సమస్యలను గుర్తించి, 11 గళ్ల పరీక్ష శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రాయల్, టీమ్ అలర్ట్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ సోమశేఖర్, సూపర్‌వైజర్ లక్ష్మి, మోహన్, కమలమ్మ, వైద్య సిబ్బంది శిల్ప, దివ్య, సరస్వతి, కవిత, సుభాషిణి, సరళ, భాగ్యం పాల్గొన్నారు.

శివరాత్రి పూజల్లో పెద్దిరెడ్డి దంపతులు



దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చిచ్చిలివారిపల్లెలో వెలసిన మల్లికార్జునస్వామి, దేవళంపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల్లో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి కుటుంబీకులు పాల్గొన్నారు.

నేడు సీతమ్మగుట్ట తిరునాళ్ల

సదుం: మండలంలోని సీతమ్మగుట్ట వద్ద గురువారం తిరునాళ్ల జరగనుంది. శివరాత్రి మరుసటి రోజు గుట్టపై తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు గుట్టపై ఉన్న సీతమ్మ, శివాలయాలను, గుట్ట కింద ఉన్న ఆంజనేయ, వినాయకస్వామి ఆలయాలను సందర్శించి, మొక్కులు చెల్లిస్తారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం అన్నదానం చేయనున్నారు.

దరఖాస్తు చేసుకోండి

శాంతిపురం: తులసినాయనపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎండీకేవీ లత తెలిపారు. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న, లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.75, ఇతరులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి, ఇతరులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలని తెలిపారు.

చిత్తూరు: సూర్యప్రతాప్ కల్యాణ మండపంలో ద్వాదశ జ్యోతిర్లింగ నమూనాలు





శివలింగ పూజలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సభ్యులు



సర్వం.. శివోహం!

- ఘనంగా మహా శివరాత్రి వేడుకలు
- పోటెత్తిన శివాలయాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహా శివరాత్రి పర్వదినాన్ని చిత్తూరు నగరంలో బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో అభిషేక పూజలు విశేషంగా కొనసాగాయి. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు హరహర మహదేవ శంభోశంకరా అంటూ శివనామస్మరణలో మునిగిపోయారు. రాత్రి జాగారణ చేశారు. వీధినాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- ఈశ్వరగుడి వీధిలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో వేకువజామున స్వామిని సుప్రభాత సేవలో మేల్కొలిపి అభిషేక పూజలు చేశారు. రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. ఆలయ ఆవరణలో దీపారాధన చేసి స్వామి వారిని తరించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.
- కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారికి శివరాత్రిని పురస్కరించుకుని భక్తులచే పాలాభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ వేదికపై ఆశీసులు చేసి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు రాకతో ఆలయం కిటకిటలాడింది.
- సంతపేటలోని శ్రీకుబేర ఉమామహేశ్వరస్వామి ఆలయంలో రావణబ్రహ్మ కైలాస పర్వతాన్ని మోస్తున్నట్లు తీర్చిదిద్దారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు శివలింగానికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు బారులు తీరారు. ఇరువారంలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో మహాభిషేకం భక్తిశ్రద్ధలతో చేశారు.
- ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని సూర్యప్రతాప్ కల్యాణ మండపంలో ద్వాదశ, సహస్రలింగ దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తొలుత ఆ సభ్యులు శివలింగాలకు ప్రత్యేక పూజలు చేసి శివనామాలు జపించారు. శివలింగానికి పాలాభిషేకం చేసేలా ఏర్పాటు చేసిన సెట్టింగ్ భక్తులకు ఆకట్టుకుంది.

రాజుగుడిలో ఎంసీ విజయానందరెడ్డి

నీవానది ఒడ్డున వెలసిన రాజుగుడిలోని స్వామివారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పెద్దలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనను దుశ్శాలువలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. తదనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.









చిత్తూరు: కుబేర ఉమామహేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు, రాజుగుడిలో క్యూకట్టిన భక్తులు, అగస్తీశ్వరస్వామి ఆలయంలో క్యూలో వేచిఉన్న భక్తులు, భక్తులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంసీ విజయానందరెడ్డి

మణికంఠేశ్వరుడికి శివరాత్రి మహోత్సవం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయస్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి మహోత్సవాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. వేకువజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అభిషేక పూజలు జరిపించారు. పుష్పాలతో స్వామివారిని సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు దీపారాధనతో స్వామిని కొలిచారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.



మణికంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు, అధికారులు

వైభవంగా కల్యాణోత్సవం

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి కాగడా హారతి సమర్పించి స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవమూర్తులకు గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి తిరుమంజన సేవ నిర్వహించి ఆలయ ప్రాంగణంలో వేదమంత్రాల నడుమ మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్సవం వైభవంగా సాగింది. మహాలక్ష్మి కుంకుమార్చన చేసి ముత్తైదువులందరికీ పసుపు కుంకుమ, బొందారం అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.



కల్యాణోత్సవంలో స్వామి అమ్మవారు

హర హర.. శంభో శంకర









విశేష పూజలందుకున్న మల్లేశ్వర స్వామి, నందీశ్వరుని పూజిస్తున్న భక్తులు, లక్షబిల్వార్చనలో పాల్గొన్న భక్తులు, కాలభైరేశ్వరాలయంలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: మండల కేంద్రంలోని కాలభైరేశ్వర ఆలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఆలయం భక్తులతో పోటెత్తింది. హరహర శంభో శంకర... శివనామస్మరణతో మార్మోగింది. కాలభైరేశ్వర ఆలయంలో ఉదయం 5 గంటలకు స్వామికి అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. 6 గంటలకు ఆలయంలో అంకురార్పణ, కలశప్రతిష్ఠ, గణపతి హోమం చేశారు. అనంతరం లక్షబిల్వార్చన, శివకోటి భజనలు, భక్తికీర్తనలు ఆలపించారు. 11 గంటలకు కలశపూజ నిర్వహించారు. భక్తులు కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో శివలింగానికి తీర్థంతో అభిషేకించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రదోష కాలంలో నందీశ్వరునికి అభిషేకం, విశేష పూజలు చేశారు. 4 గంటలకు ఆలయం ఆవరణలో అర్చకులు భక్తిప్రపత్తులతో మృత్యుంజయ హోమం నిర్వహించారు. 5 గంటలకు లలితా సహస్ర నామం, పూర్ణాహుతి హోమం నిర్వహించారు.

పట్టువస్త్రాల సమర్పణ

శివరాత్రి వేడుకల్లో భాగంగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈఓ పెంచల కిషోర్ కాలభైరేశ్వర స్వామికి పట్టువస్త్రాలు, పూజా సామగ్రి సమర్పించారు. అనంతరం స్వామికి అభిషేకం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం అధికారులు, అర్చకులు స్వామికి పట్టువస్త్రాలు, పూజాసామగ్రి సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానంతోపాటు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

అగ్నిగుండ ప్రవేశం

శివుడి భక్తులు శివమాల ధరించి దీక్షలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ఇరుముడి కట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అగ్నిగుండ ప్రవేశం చేశారు. 7.30 గంటలకు ఆలయంలో స్వామికి అఖండ కర్పూర హారతి సమర్పించారు.

స్వామి సేవలో ప్రముఖులు

చిత్తూరు రూరల్ సీఐ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీబాబు, సీకే లావణ్య, మాజీ కార్పొరేటర్ వసంతకుమార్, కటారి హేమలత తదితరులు కాలభైరేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

పల్లకీ ఎక్కిన వీరభద్రస్వామి

మండలంలోని దిగువ మోదలపల్లెలో పల్లకిలో ఆశీనులైన వీరభద్రస్వామిని భక్తులు మోసుకుంటూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం స్వామిని ఊరేగించారు. ఎగువ తవణంపల్లె శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. టి.పుత్తూరు సమీపంలోని సిద్ధేశ్వర కొండ దగ్గర సిద్ధేశ్వర స్వామికి అభిషేకం, పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అరగొండ శివాలయంలో అర్చకులు, అభిషేకం, పూజలు నిర్వహించారు.





పట్టువస్త్రాలు తీసుకొస్తున్న అర్ధగిరి, కాణిపాకం ఆలయాల అధికారులు, ఎమ్మెల్యే మురళీమోహన్



అరగొండ శివాలయంలో అన్నదానం



కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



శివకోటి భజనలు ఆలపిస్తున్న భక్తబృందం



భైరవవాహనంపై శివపార్వతులు

కొల్ల.. జన జాతర!



- నేడు చిత్తూరులో శ్మశాన కొల్ల
- నీవానది ఒడ్డున దక్షుడి సంహారం
- 192 ఏళ్లకు పైగా కొల్ల జాతర
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

శ్మశానకొల్ల మైదానంలో దక్షుడి ప్రతిమను తీర్చిదిద్దుతున్న కళాకారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో శ్మశానకొల్ల అంటే జన జాతరను తలపిస్తుంది. ఈ తరం కూడా పూర్వీకుల కట్టుబాట్లకు కట్టుబడి శ్మశాన కొల్లను కొనసాగిస్తోంది. మహా శివరాత్రి మరుసటి రోజు ఈ ఉత్సవాన్ని అట్టహాసంగా.. సంప్రదాయబద్ధంగా జరిపిస్తోంది. ఈ శ్మశాన జాతర చిత్తూరులో ఏటా వినూత్న రీతిలో నిర్వహిస్తోంది. దక్షుడి సంహారమే ఈ కొల్ల ప్రత్యేకతగా చాటిచెబుతోంది. ఉత్సవాన్ని చూసేందుకు చుట్టు పక్కల రాష్ట్రాల ప్రజలు భారీగా తరలివస్తుంటారు. నేడు(గురువారం) శ్మశానకొల్ల ఉత్సవం కోలాహలంగా జరగనుంది.

శివరాత్రి పర్వదినం మరుసటి రోజు చిత్తూరు నగరం సంతపేట నీవానది ఒడ్డున ప్రతి ఏటా శ్మశానకొల్ల (మయాన సేవ)ను నిర్వహిేంచడం ఆనవాయితీగా వస్తోంది. గత 192 ఏళ్లుగా ఈ సేవను వంశపారపర్యంగా స్థానిక కుటుంబీకులు నిర్వహిస్తూ వస్తున్నారు. గుర్రప్పనాయుడు వీధి, గిరింపేటలోని వారు ఈ శ్మశాన కొల్లను ఏటా విజయవంతంగా జరిపిస్తూ వస్తున్నారు. స్థానికంగా వెలిసిన శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శివరాత్రి, తరువాత రోజు ప్రత్యేక అలంకారంలో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు. కఠోర దీక్షలు, నియమాలు పాటించి శ్మశానకొల్ల నిర్వహణకు సిద్ధమవుతుంటారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నీవానది ఒడ్డున జరిగే శ్మశానకొల్లకు తీసుకెళ్లారు. అక్కడ దక్షుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి దక్ష సంహారం చేయడం ఈ కొల్ల ప్రత్యేకత.

దక్షసంహారమంటే..

పరమశివుడి భార్య సతీదేవి. ఆమె తన తండ్రి దక్షుడి నిర్వహించే యజ్ఞానికి ఆహ్వానం లేకున్నా వెళుతుంది. అక్కడ అవమానానికి గురై ఆత్మార్పణ చేసుకుంటుంది. ఈ విషయం తెలిసి ఆగ్రహించిన శివుడు తన భార్య మృతికి కారకుడైన దక్షుడిని సంహరించి రమ్మంటూ వీరభద్రుడిని పంపుతాడు. అతడు యజ్ఞం జరిగే చోటుకు చేరుకుని యజ్ఞశాలను ధ్వంసం చేసి దక్షుడిని సంహరిస్తాడు. అప్పటికి శివుడు శాంతిస్తాడన్నది పురాణ గాథ. ఈ రకంగా పూర్వీకులు ప్రారంభించిన ఈ దక్షుడి సంహారాన్ని వారి తరతరాల వారు కూడా ఆచరిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి కూడా దక్షుడి సంహారానికి అంకాళపరమేశ్వరితో పాటు భక్తులు శ్మశానకొల్లకు వేలాదిగా తరలివస్తారు. అమ్మవారికి ఇష్టమైన పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. దక్షుడి సంహార ప్రక్రియను పూర్తిచేశారు. అనంతరం దక్షుడి మట్టి కోసం జనం ఎగబడుతుంటారు. ఆ మట్టి ఇంట్లో పెడితే మంచి జరుగుందని వారు భావిస్తుంటారు. ఆ తర్వాత అంకాళ పరమేశ్వరి నగర వీధుల్లో ఊరేగుతారు.

కొల్లకు జనజాతర

మయాన సేవకు తిలకించేందుకు రాష్ట్ర ప్రజలే కాకుండా తమిళనాడు, కర్ణాటకవాసులు భారీ సంఖ్యలో తరలి వస్తుంటారు. దీంతో నీవానది ఒడ్డుప్రాంతం గురువారం మధ్యాహ్న ప్రాంతంలో జనంతో కిక్కిరిసి ఉంటుంది. అంకాళపరమేశ్వరి, శివ నామస్మరణాలతో మారుమోగుతుంటుంది. ఈదృష్ట్యా పోలీసులు అక్కడ భారీ భద్రత కల్పిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గత మూడేళ్లుగా కరోనా వ్యాప్తి కారణంగా భక్తుల రాక తగ్గింది. ఈసారి భక్తులు తాకిడి అధికంగా ఉండవచ్చని నిర్వాహకులు, పోలీసులు భావిస్తున్నారు. ఆ రకంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శ్మశానకొల్ల ప్రాంతంలో దక్షుడి ప్రతిమను తీర్చిదిద్దారు. గెరిగను అలంకరించి నగర వీధుల్లో ఊరేగించారు.





శ్మశానకొల్లలో అమ్మవారు ఊరేగుతున్న దృశ్యం (ఫైల్‌ఫోటో), గెరిగెకు పూజలు చేస్తున్న దృశ్యం

యూరియా బ్లాక్‌లో విక్రయించకుండా చూడాలి

బంగారుపాళెం: యూరియా బ్లాక్‌లో విక్రయించకుండా చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యూరియా అందుబాటులో లేక జిల్లాలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ డీలర్లతో కుమ్మక్కై యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్మిస్తున్నారని చెప్పారు. 45 కిలోల బస్తా రూ.226.50కు విక్రయించాల్సి ఉండగా బయట రూ.380కు విక్రయిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు.